## సుక్కల్ తీర్థ్‌లో గాలి దుమారం.. వర్షం...
### ఎగిరిపోయిన రేకులు...పలువురికి గాయాలు


సుక్కల తీర్థ్‌లో ఎగిరిపోయిన ఇంటిపై రేకులు

**కంగ్టి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సుక్కల్ తీర్థ్ గ్రామంలో శుక్రవారం గాలి దుమారంతో పడిన వర్షంతో గ్రామస్తులు పరేషాన్ అయ్యారు. వీరిని ఈదురు గాలులకు ఇండ్లపై ఉన్న రేకులు, గ్రామంలోని చర్చిపై అమర్చిన రేకులు పతంగుల్లా ఎగిరిపోయాయి. రేకులు ఎగిరిపడిపోయిన సంఘటనలో గ్రామానికి చెందిన స్టీఫెన్, నవమి, చిట్టి, చిన్నలకు గాయాలు కాగా ఆసుపత్రులకు తరలించి చికిత్సలు అందచేశారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త


## చౌకన్‌పల్లిలో తాగునీటి కష్టాలు

**కంగ్టి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చౌకన్‌పల్లిలో ప్రజలు తాగునీటి కోసం నిత్యం తంటాలు పడాల్సి వస్తోంది. గ్రామంలోని ఎస్సీవాడకు మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ప్రైవేటు బోరును ఆశ్రయించాల్సిన వస్తోంది. గ్రామానికి సరఫరా అయ్యే మిషన్ భగీరథ పైపులైన్ సిసి రోడ్డు నిర్మించడంతో నీటి సరఫరా ఆగిపోయిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామానికి యధావిధిగా మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వినతి చేస్తున్నారు.


తాగునీరు పట్టుకునేందుకు తంటాలు పడుతున్న మహిళలు


సమీక్ష సమావేశంలో మంత్రి దామోదర్, పిసిసి అధ్యక్షులు

## గాంధీ భవన్‌లో సమీక్ష సమావేశం
### పాల్గొన్న మంత్రి దామోదర్

**జహీరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో గురువారం జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి దామోదర్, మాజీ మంత్రి డాక్టర్ జెట్టి గీతారెడ్డి, రాష్ట్ర సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డి తదితరులు పాల్గొనగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల దగ్గరికి తీసుకుపోవాలని సూచించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు విధిగా పాల్గొనాలని సూచించారు. సమావేశంలో ఏఐసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఏఐసిసి కార్యదర్శులు విష్ణునాథ్, విశ్వనాథన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్రుడిని దర్శించుకున్న మంత్రి దామోదర్

**రాయికోడ్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో భద్రకాళి సమేత శ్రీవీరభద్రేశ్వరస్వామి జాతర ఉత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. జాతర ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ హాజరై అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఆలయంలో స్వామి వారికి కళ్యాణ మహోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయ నుంచి విగ్రహాల ఊరేగింపు బసవేశ్వర ఆలయం వరకు నిర్వహించారు. అగ్గి గుండంలో భక్తులు స్వామి వారిని స్మరిస్తూ అగ్నిని తొక్కారు. జాతర ఉత్సవాలకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు.

## ఇందిరమ్మ కమిటీ సభ్యులతో అదనపు కలెక్టర్ సమీక్ష

**కంది, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎద్దుమైలారంలో శుక్రవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఇందిరమ్మ ఇండ్ల కమిటి సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కసాల బుచ్చిరెడ్డి, ఎంపిఓ మహీందర్‌రెడి, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, కమిటి బాధ్యులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి
### నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతరెడ్డి


వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న

**శివ్వంపేట, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త) :** వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే సునీతరెడ్డి అన్నారు. శుక్రవారం పిల్లుట్ల, లింగోజిగూడ, కొత్తపేట, రత్నాపూర్ గ్రామాలలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే సునీతరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వడగండ్ల వానతో పంట నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వమే ఎకరాకు రూ. 25 వేల నష్టపరిహారం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. వడగండ్ల వానకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వకపోతే రైతుల పక్షాన పోరాటం చేస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యుల మన్సూర్, మాజీ వైస్ ఎంపీపీ రమ కాంత్ రెడ్డి , మాజీ సర్పంచ్ పెద్దపులి రవి, నాయకులు నరసింహారెడ్డి, చింత స్వామి, బబ్బురి వెంకటేష్, పిల్లి శివకుమార్, ఆర్ఐ కిషన్,ఏఈఓ మోనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న వరి పంటలు పరిశీలించిన ఎమ్మెల్యే...

**నర్సాపూర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** గత రాత్రి కురిసిన వడగండ్ల వానకు పలు గ్రామాలలో వరి పంటలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పరిశీలించారు. రుస్తుంపేట, పెద్దచింతకుంట, చిన్న చింత కుంట, లింగాపూర్, గొల్లపల్లి,బ్రాహ్మణ పల్లి, తిరుమలాపూర్ గ్రామాల్లో వడగండ్లతో కూడి నటువంటి భారీ వర్షం పడడం వల్ల నష్ట పోయిన రైతులను ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి పరామర్శించారు ఈ సందర్బంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతులు ఎవ్వరు అధైర్య పడ కుండా ఉండాలన్నారు. వరి పంటల్లో నష్టపోయిన రైతులకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని పంట నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి వినతి చేసి పంట నష్ట పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిదంగా ఈ దూరు గాలులతో ఊడిన వడగండ్ల వర్షానికి పలు నరగామాల్లో ఇండ్లు ధ్వంసంఅయ్యాయని వారికి పైతం నష్ట పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఈమేరకు నర్సాపూర్ మండలంలో ఈ అకాల వర్షానికి 925 ఎకరాల వరి పంట మరియు 6 ఎకరాల మామిడి తోట దెబ్బ తిన్నట్టు గుర్తించడం జరిగిందని వ్యవసాయాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్,మండల వ్యవసాయ అధికారిణి దీపిక, వ్యవసాయ విస్తరణ అధికారులు చంద్రవేణి, దుర్గా ప్రసాద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఫైజల్, నరేందర్ మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.


దెబ్బతిన్న వంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

# భూభారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**అల్లాదుర్గం, ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** భూభారత్ చట్టం-2025లో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చేవెళ్లలోని రైతువేదికలో భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. భూసమస్యలు ఏన్ని ఉన్నా సంవత్సరకాలంలో పరిష్కరించుకోవడానికి భూభారి ద్వార ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి కోర్టులను ఆశ్రయించుకుండానే షెడ్యూల్(ఏ)ను ఏర్పాటు చేసి భూమి విలువ 5 లక్షల లోపు ఉన్న పక్షంలో ఆర్డిఓ స్థాయి, 5లక్షలకు పై ఉన్న పక్షంలో కలెక్టర్ స్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించే అవకాశం ఉందన్నారు. ధరఖాస్తులు చేసుకున్న వ్యక్తి సమస్యలను కలెక్టర్ స్థాయిలో సిసిఎల్ఏకు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ధరణిలో కొన్ని లోపాలు ఉండటంతో భూ సమస్యలు పరిష్కారం కాలేదని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వార రైతులకు భూభారతి పోర్టల్‌లోఉన్న అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యఓఉలు శేషారెడ్డి, నాయకులు సుభాష్‌రావు దేశ్‌పాండే, మాజీ ఎంపిటిసి సభ్యులు విఠల్‌రెడ్డి, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

## ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవానికి
## మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ఆహ్వానం

**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** ఈ నెల 21వ తేదీ నుండి 23వ తేదీ వరకు పెద్ద శంకరంపేటలో శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ పున:ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలిని కోరుతూ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు ఆలయ కమిటీ అధ్యక్షులు గుజ్జరి కనకరాజు ఆహ్వానపత్రికను అందజేశారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్‌లోని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు నివాసంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గుజ్జరి కనకరాజు ప్రత్యేకంగా పెద్ద శంకరంపేటలో నిర్వహిస్తున్న సీతారామచంద్ర స్వామి ఆలయ పున:ప్రతిష్ఠ కార్యక్రమాలకు హాజరు కావాలని ఆయనను కోరడంతో పాటు శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

## భర్తని దుబాయ్ నుండి రప్పించాలని భార్య వేడుకోలు

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 18ప్రభాతవార్త:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన చొప్పరి లింగయ్యను తెలంగాణకు రప్పించాలని కుటుంబీకులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. లింగయ్య భార్య రజిత తెలిపిన వివరాల ప్రకారం నెలరోజుల క్రితం కూలీ పనినిమిత్తం లింగయ్య దుబాయ్‌కి వెళ్లాడని దీంతో 20రోజులుగా కాళ్లవాపులు ఉండటంతో నడవలేని స్థితిలో ఉన్నాడని సెల్ఫీ వీడియో తీసి లింగయ్య కుటుంబ సభ్యులకు తెలిపాడని చెప్పారు. తిరిగి రాకుండా కంపెనీ వారు పాస్‌ఫోర్టు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎలాగైన తభర్తను క్షేమంగా ఇంటికి రప్పించాలని భార్య రజిత ప్రభుత్వాన్ని వేడుకుంటోంది.

## గుడ్ ఫ్రైడే ఆరాధనలో పాల్గొనడం సంతోషంగా ఉంది
### టిజిఐఐసి చైర్మన్ నిర్మలరెడ్డి

**కొండాపూర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:**

మానవాళి చేసిన పాపాలకు యేసు ప్రభువు తన ప్రాణాలను శిలువపై ఉంచిన గుడ్ ఫ్రైడే ఆరాధనల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల రెడ్డి అన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా కొండాపూర్ మండల పరిధిలోని గంగారం సిల్వగుట్టపై నిర్వహించిన గుడ్ ఫ్రైడే వేడుకల్లో అమే పాల్గొని క్రిస్టియన్‌లతో ప్రత్యేక ఆరాధన చేసి లోక రక్షకుని సందేశాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుభ శుక్రవారంకు ఒక ప్రత్యేకత ఉందని, యేసు ప్రభు శిలువపై తన ప్రాణాలను పణంగా పెట్టారన్నారు. ప్రేమ, ఆప్యాయతలను అందరికీ పంచాలని సమాజానికి హితబోధ చేసిన జీసస్ మానవాళికి అందజేసిన సందేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు, కాంగ్రెస్ నాయకులు నర్సింహా రెడ్డి, నర్సింలు, రవి, కిషన్ నాయక్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి

## బైక్‌లు చోరీ చేస్తున్న ఇద్దరి అరెస్ట్
### 8 మోటార్‌సైకిళ్లు, కత్తి స్వాధీనం

**జహీరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనాలను దొంగలిస్తూ హైదరాబాద్‌లో అమ్ముకుని జల్సాలు నిర్వహిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని 8 సైకిల్ మోటార్లను, ఒక కమ్మ కత్తి, చాకులను స్వాధీనం చేసుకున్న సంఘటన శుక్రవారం పట్టణంలోని ఆర్టీసి బస్టాండు ముందు చోటు చేసుకుంది. జహీరాబాద్ పట్టణంలోని పోలీసు ఠాణాలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డిఎస్‌పి కే రామ్మోహన్‌రెడ్డి ఇందుకు సంబందించిన వివరాలను వెల్లడించారు. జహీరాబాద్‌పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో విద్యను అందుకుంటున్న సుభాష్‌గంజ్‌కు చెందిన మహమ్మద్ అల్తాఫ్ హుస్సేన్(19), మరో బాల నేరస్థుడు జహీరాబాద్ నుంచి హైదరాబాద్‌కు పల్సర్ మోటారు సైకిల్ (టిఎస్ ఈటి 3826), యాక్టివా 5జి మోటార్ సైకిల్ (టిఎస్ 12ఈకె 2859)లపై వెళుతున్న వారిని అపి వాహనాలను తనిఖీచేయగా దొంగతనంచేసిన వాహనాలుగా గుర్తించి ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారంచగా జహీరాబాద్, సదాశివపేట, సంగారెడ్డి, హైద్రాబాద్ పట్టణాల్లో మోటార్ సైకిళ్లను దొంగ తనం చేయడం, దొంగతనానికి అడ్డుగా వచ్చిన వారిని కమ్మకత్తితో, చాకులతో దాడి చేసి పరారవుతూ వాహనాలను అమ్ముకుని జల్సాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారన్నారు. అదుపులోకి తీసుకుని ఇరువుని రిమాండ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జహీరాబాద్ సిఐ ఎస్ శివలింగం, పట్టణ ఎస్ఐ యం కాశీనాథ్‌లు పాల్గొనగా దొంగలను పట్టుకోవడానికి కృషి చేసిన ఐడి పార్టీ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ నర్సిములు, కానిస్టేబుళ్లు సంజీవ్‌రావు, ఓందేవ్, అస్లామ్, ఆనంద్‌లను డిఎష్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

## అకాల వర్షానికి అపార నష్టం

**దుబ్బాక, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం అకాల వర్షంతో తడిసిన వడ్లు, ఈదురు గాళ్లులతో వడ్లు రాలి రైతులు నష్టపోయారు. ఆరుకాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో కాలం కన్నెర్ర చేయడంతో రైతులు అనేక విధంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం తక్షణమే రైతులను ఆదుకునేందుకు తగిన చర్యలు చేపట్టి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు ఉన్నారు.

## అనుమానాస్పద వ్యక్తులపై నిఘా : ఎస్ఐ

**పుల్‌కల్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** ఉమ్మడి పుల్‌కల్ మండలంలో అనుమానాస్పద వ్యక్తుల నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపారు. గురువారం రాత్రి చౌటకూరు మండలం తాడ్దానిపల్లి శివారులో 161 జాతీయ రహదారిపై గల టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తూ వ్యక్తులను ఆరా తీశారు. రాత్రి వేళలో ఎవరైనా అనుమానాస్పదంగా వాహనాలపై తిరిగాడితే వారిని సోదా చేస్తామన్నారు. అనవసరంగా ఎవరూ రాత్రి వేళల్లో గ్రామాల్లో, జాతీయ రహదారిపై తిరగవద్దని ప్రజలకు సూచించారు.

# భూవివాదాల పరిష్కారానికే భూభారతి చట్టం

### మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

**రామాయంపేట మున్సిపాలిటీ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం...రైతులకు చుట్టం లాంటిదని, ఈ చట్టంతో భూవివాదాలు సత్వర పరిషారానికి ఎంతో ఉపయోగపడుతుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శుక్రవారం రామాయంపేటలోని రైతువేదికలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భూ భారతి చట్టం రెవెన్యూ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతుల కోసం పెట్టిన ధరణి కేసీఆర్‌తోపాటు కేవలం నలుగురికే ఉపయోగపడిందని, కానీ ప్రస్తుతం ప్రజల కష్టాలను తీర్చే ప్రభుత్వంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ధరణి విషయంలో మాట ఇచ్చారని, ధరణి స్థానంలో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు, ప్రజలకు ఉపయోగపడే నూతన భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చారని అన్నారు. ఇందిరమ్మ రాజ్యమే రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు, ప్రజల అభిప్రాయాలను తీసుకున్న తదుపరి భూభారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. రైతులు వారి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే విధంగా పగడ్బందీగా ఈ చట్టాన్ని అమలు చేసేందుకు జిల్లాలో రెవెన్యూ యంత్రాంగం పని చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బడుగు, బల హీన వర్గాలకు ఈ చట్టం ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. రైతులు, ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

రేవంత్‌రెడ్డి, మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం భూ భారతి చట్టంపై జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టం మార్గదర్శకాలను రైతులు, ప్రజలకు తెలియజేసేందుకు జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న పేర్కొన్నారు. భూభారతి చట్టంలో భూ సమస్యల పరిష్కారం కోసం కొత్త రూల్స్ వచ్చాయన్నారు. నూతన చట్టం రూల్స్ గురించి తహసీల్దార్‌లు, నాయబ్ తాసీల్దార్లకు, ఆర్ఐలకు కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి నూతన చట్టం భూ భారతి, దానిలోని అంశాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఇంతకుముందు ఉన్న ధరణిలో కోల్పోయిన భూ హక్కులు ఏవైతే ఉన్నాయో ఇప్పుడు వచ్చిన కొత్త చట్టంలో ఎలాంటి హక్కులు ఉన్నాయనేది తెలియజేసేందుకే ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరు నూతనంగా వచ్చిన భూ భారతి చట్టం గురించి ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. నూతన చట్టం ద్వారా తప్పులు సవరించుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే తాసీల్దార్ రిపోర్ట్ మొదలుకొని, ఆర్డీవో, కలెక్టర్, ఆపైన సిసిఎల్ఏ వరకు అప్లై చేసుకునే అవకాశం ఉందన్నారు. త్వరలోనే గ్రామ పాలన అధికారులను ప్రభుత్వం నియమించనుందన్నారు. జూన్ 2వ తేదీనుండి ఒక్కోరోజు ఒక్కో గ్రామాన్ని సందర్శించి, సమస్యలను తెలుసుకొని అట్టి సమస్యలను నెల లోపుగానే పరిష్కరించే విధంగా ప్రభుత్వం యోచిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎం.నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, స్థానిక తాసీల్దార్ రజని కుమారి, ఎంపీడీవో షాజీలొద్దిన్, మండల వ్యవసాయ శాఖ అధికారి రాజ్‌నారాయణతో పాటు రెవెన్యూ అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.


కూలిపోయిన ఇల్లును పరిశీలిస్తున్న సునీతారెడ్డి

## కూలిన ఇంటిని పరిశీలించిన ఎమ్మెల్యే

**నర్సాపూర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** గత రాత్రి కురిసిన ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షానికి నర్సాపూర్ మండల పరిధిలోని పలు గ్రామాలలో ఇళ్లు కూలిపోగా మిగతా ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి. నర్సాపూర్ పట్టణానికి చెందిన బబ్బూరి కృష్ణ వడగండ్ల వానకు ఇంటి రేకుల లేచిపోయాయి. అదేవిధంగా బ్రాహ్మణపల్లిలో పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కూలిన ఇళ్లను పరిశీలించారు.బబ్బూరి కృష్ణ ఇల్లును ఆమె పరిశీలించారు. బాధితుడు కృష్ణను ఆర్థికంగా ఆదుకువాలని తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఆదేశాలు ఇచ్చారు అదేవిధంగా కూలిన ఇళ్లకు దెబ్బతిన్న వరి పంటలకు నష్టపరిహారం చెల్లించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్, నాయకులు సత్యంగౌడ్, భోగచంద్రశేఖర్, ఆనంద్ కుమార్, కిషోర్‌గౌడ్, నాగరాజుగౌడ్, శ్రావణ్ కుమార్, జ్ఞానేశ్వర్‌గుప్త పాల్గొన్నారు

## చెట్టును ఢీకొన్న బైక్.. గుర్తు తెలియని వ్యక్తి మృతి

**న్యాల్‌కల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనం (ఎపి 11యం 1716) అతివేగంతో చెట్టును ఢీకొన్న సంఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పోలీసు ఠాణా పరిధిలోని గంగ్వార్ చౌరస్తాలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ చల్లా రాజశేఖర్ కథనం ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళుతూ రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తిని గుర్తిస్తూ రూరల్ సిఐ 8712656732, పోలీసు ఠాణా 8712661850, 8978289929లకు సమాచారం అందించాలని ఎస్ఐ చల్లా రాజశేఖర్ సూచించారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**మర్కుక్, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి చెందిన ఎలిమెల పోచయ్య(50) గురువారం చేబర్తి కెనాల్‌లో బోరు మోటారు మరమ్మతు చేస్తుండంగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మర్కుక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గుండెపోటుతో ఖైదీ మృతి

**కంది, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** సంగారెడ్డి సెంట్రల్ జైలులో శిక్షను అనుభవిస్తున్న ఓ ఖైదీ గెండెపోటుతో మృతి చెందినట్లు జైలు సూపరింటెండెంట్ సంతోష్ రాయ్ తెలిపారు. సూపరింటెండెంట్ సంతోష్ రాయ్ కథనం ప్రకారం... మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన వీ వెంకటేశ్వర్లు (39) ఓ గంజాయి కేసులో నింధితుడిగా ఈ నెల 3న సెంట్రల్ జైలులో రిమాండ్‌కు వచ్చాడన్నారు. ఈ నెల 17న రాత్రి వెంకటేశ్వర్లకు 17న రాత్రి ఫీట్స్ రావడంతో వెంటనే వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందింగా కొలుకున్నాడన్నారు. అర్ధరాత్రి ఒక్కసారికిగా కింద పడిపోవడంతో వైద్య సిబ్బంది సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఉదయం 5.30 గంటలకు మృతి చెందాడన్నారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**వర్గల్, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త):** అప్పుల భారంతో వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వర్గల్ మండలం తునికిఖాల్సా గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం తునికిఖాల్సా గ్రామానికి చెందిన కొండగళ్ల అంజయ్య(45)కు ఇద్దరు కూతుర్లు ఉండగా పెద్ద కూతురు వివాహం నాలుగు సంవత్సరాల క్రితం జరిపించగా రూ.5 లక్షల అప్పు చేశాడు. అప్పు తీర్చకుండానే చిన్న కూతురు వివాహం జరిపించడానికి శుక్రవారం నిశ్చితార్థం పెట్టుకుందామని నిర్ణయించారు. గ్రామంలో పెద్దలను నిశ్చితార్థానికి ఆహ్వానించడంతో పాటు అప్పుగా డబ్బులు తేవడానికి అంజయ్య శుక్రవారం రాత్రి ఇంటి నుండి వెళ్లాడు. రాత్రి పొద్దుపోయే వరకు అంజయ్య ఇంటికి రాకపోవడంతో అతని భార్య స్వరూప గ్రామంలో పలు చోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. అదే గ్రామానికి చెందిన కొండగళ్ల చంద్రయ్య శుక్రవారం ఉదయం రైతువేదిక సమీపంలో ఉన్న ఓ చెట్టుకు అంజయ్య ఉరివేసుకున్న సంఘటనను చూసి కుటుంబసభ్యులకు తెలియజేశారు. దీంతో మృతుని భార్య స్వరూప సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తుల సహాయంతో మృతదేహాన్ని కిందకు దించారు. అంజయ్య ఆత్మహత్య చేసుకోవడానికి అప్పుల భారమే కారణమని భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

## పిడుగుపాటుకు ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

**ఝరాసంగం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** పిడుగపాటుకు ఎద్దు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నర్సాపూర్‌లో జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బసిరెడ్డి గాల్‌రెడ్డికి చెందిన ఎద్దు వ్యవసాయ పొలం వద్ద మేత మేస్తున్న తరుణంలో పడిన పిడుగుదాటికి 1లక్ష 20వేల రూపాయల విలువ చేసే ఎద్దు మృత్యువాత పడింది. పిడుగుపాటుకు ఎద్దు మృతిచెందినట్లు తెలుసుకున్న మండల పశు వైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. పేద రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థుల వినతి చేశారు.

## మూడు గేదెలు...

**చేర్యాల, ఏప్రిల్ 18,ప్రభాతవార్త :** చేర్యాల మండలంలో సాయంత్రం కురిసిన అకాల వర్షం,పిడుగుపాటుకు రెండు గేదేలు మృతి చెందిన సంఘటన పోతిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది.మండలంలోని పోతిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన గెడిసె కనకయ్యకు చెందిన రెండు గేదేలు,గడ్డం నరేష్‌కు చెందిక ఒక గేదే ఎప్పటిలాగే తన వ్యవసాయ బావి వద్ద కట్టెసి ఉంచారు.శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులతో వర్షం, పిడుగు పడటంతో రెండు గేదేలు మృతి చెందాయి.రెండు గేదేల విలువ సుమారు రూ.1లక్ష ఉంటుందన్నారు.మరోకరికి చెందిన గేదే విలువ రూ.45వేలు ఉంటుందన్నారు.బీదకుటుంబమైన వారిని ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## జెరూసలేం ప్రేయర్ చర్చ్‌లో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



గుడ్ ఫ్రైడే వేడుకల్లో పాల్గొన్న ఎర్రబెల్లి సతీష్ రావు

**కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** గుడ్ ఫ్రైడే సందర్భంగా శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ శంషిగూడ లోని జెరూసలేం ప్రేయర్ చర్చ్ లో పాస్టర్ రాజు ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రార్ధన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు హాజరయ్యారు.

## కార్మికులకు వాటర్ బాటిల్స్ పంపిణీ...



వాటర్ బాటిల్స్ ను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

**వివేకానంద కాలని ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** పారిశుద్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు నగరానికి అవార్డులు తీసుకురావడంలో వారి పాత్ర కీలకమని సత్ సేవ సంస్కృతి ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు పేర్కొన్నారు. సత్ సేవ సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానంద డివిజన్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వాటర్ బాటిల్స్ ను ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజం నిద్రలేవకముందే నగరంలో ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు శుభ్రం చేస్తూ ప్రజా ఆరోగ్య పారిశుద్ద పరిరక్షణలో నిత్యం సేవలు అందిస్తున్నారని కొనియాడారు. పారిశుద్ద కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. పారిశుద్ధ నిర్వహణ పరిశుభ్రతలో కార్మికుల పనితీరు గొప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్ సేవ సంస్కృతి ఫౌండేషన్ ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, కార్యదర్శి రామ్మోహన్ రావు, సలహాదారులు మహేష్ గౌడ్, సభ్యులు సాయి, సుహాస్, నరేష్, జర్నలిస్టులు నాగరాజు యాదవ్, ఎల్లకొండ జయకుమార్ గుప్తా, హరి తదితరులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసిన నేతలు



మంత్రి కొండ సురేఖను కలిసిన నేతలు

**కంటోన్మెంట్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ నార్త్ లాలాగూడ కు చెందిన కాంగ్రెస్ ఓబీసీ ప్రధాన కార్యదర్శి యం మోహన్ ఆర్ సుందర్ రాజన్ వెంకటేష్ యాదవులు శుక్రవారం రాష్ట్రమంత్రి కొండ సురేఖను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు నార్త్ లాలాగూడ రైల్వే క్వార్టర్స్ లో ప్రసిద్ధి గాంచిన శ్రీ వీర హనుమాన్ దేవాలయంలో వచ్చే నెలలో జరిగేవేడుకలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు.

## శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి సుగంద ద్రవ్యాలు, పంచామృతములతో అభిషేకం



మండపారాధనం, లక్ష్మీగణపతి హోమం, రుద్ర, దేవి, నవగ్రహాది, హోమాలు నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** చిక్కడపల్లి బాపూనగర్ శ్రీ రాజరాజజేశ్వర దేవాలయం 41 వార్షికోత్సవ వేడుకలలో భాగంగా శుక్రవారం చక్రమేరు శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి సుగంద ద్రవ్యాలు, ఫలరసముల పంచామృతములతో అభిషేక కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు మండపారాధన, లక్ష్మీగణపతి, దేవి హోమం, అమ్మవారి మూల మంత్ర హోమం, పూర్ణాహుతి, విశేష ఆశీర్వచనం తీర్థప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తుల సామూహిక అభిషేకం, ఊరేగింపు, నందికోల సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్,.బిజెపి డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్,దామోదర్, శ్రీకాంత్, పి.నర్సింగ్ రావు, ఆలయ కమిటీ సభ్యులు అందోల్ రాజు, మహేష్, సాయి పాల్గొన్నారు. కాగా 19న మధ్యాహననం అన్న ప్రసాద కార్యక్రమం ఉంటుంది. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.

## ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వినియోగదారులకు సేవలు అందించాలి



విద్యుత్ ఉద్యోగికి అంబేద్కర్ ఎక్సలెన్సి అవార్డు అందచేసి సన్మానం

**బేగంబజార్,ఏప్రిల్ 18ప్రభాతవార్త:** విద్యుత్ సంస్థలో ఉద్యోగిగా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వినియోగదారులకు అత్యున్నతమైన సేవలను అందించినందుకు గుర్తించి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎక్సలేన్సి అవార్డును అంతడుపుల వేణుకు అందచేసి సన్మానించారు.దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ 1104 కార్మిక సంఘానికి అధ్యక్షులుగా కొనసాగుతూ గత 20 సంవత్సరాలుగా విద్యుత్ కార్మికుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు.రాజ్యాంగ విలువలకు అనుగుణంగా సమాజంలో ప్రజల సమానత్వంకోసం,మానవతా ప్రమాణాల కోసం పాటుపడుతున్న అంతడుపుల వేణును ప్లానింగ్ కమీషన్ చైర్మన్ చిన్నారెడ్డి,కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి,ప్రముఖ ఉపన్యాసకులు దేవజ్ఞశర్మలు శాలువ కప్పి సన్మానించి ఎక్సలేన్సీ అవార్డును అందచేశారు.ఈకార్యక్రమంలో నవకళ వేధిక అద్యక్షులు మల్లికార్జునరావు,మాజీ సెట్విన్ డైరెక్టర్ ఎస్.ధన్‌రాజ్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు

## నవ్యనాటక సమితి కళారంగసేవ అపూర్వం : ఉపసంచాలకురాలు వసుంధర




చైత్రచంద్రిక అభినయ శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న వసుంధర, స్వప్నసుందరి, సుధామాల, విజయకుమార్ తదితర అతిథులు

**నాంపల్లి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** ఆరున్నర దశాబ్దాలకుపైగా భారతీయ శాస్త్రీయ సంగీత నృత్య కళారంగాల్లో కళాకారులకు, ముఖ్యంగా యువ కళాకారుల ప్రతిభకు పట్టంకడుతూ ప్రోత్సహిస్తున్న నవ్యనాటక సమితి కళారంగ సేవ అపూర్వం అనితరసాధ్యమని తెలంగాణ రాష్ట్ర ఖజానా లెక్కలశాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర అన్నారు. ప్రముఖ సంస్థ నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలో నేటి నుండి 20 వరకు ప్రఖ్యాత నాట్యాచారిణి పద్మభూషణ్ విధుషీ స్వప్న సుందరిచే 3రోజులపాటు ఔత్సాహికులకు చైత్ర చంద్రిక పేరున అభినయంలో శిక్షణా శిబిరాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన జి.వసుంధర్ విధుషీ స్వప్నసుందరి, నృత్యగురువులు నిష్టల సుధామాల, ఇందిరా హేమ, మధుమతి కులకర్ణి, మాధవీమాల, ఎం. లక్ష్మిమానస, సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, బాలాజీశర్మ, కన్నారావులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఈ అభినయ శిక్షణా శిబిరాన్ని స్వప్నసుందరి స్వయంగా నిర్వహించడం, అరుదైన సాహిత్యాంశాన్ని ఎంపిక చేసుకొని అభినయంలో మెళకువలు నేర్పించడం యువకళాకారులకు లభించిన అరుదైన అపూర్వ సదవకాశమని, ఈ శిబిరంలో పాల్గొంటున్న యువ నృత్యకళాకారులందరికి శుభాకాంక్షలు తెలిపారు. నృత్యసాహిత్యాంశాలకు తగిన విధంగా అందరికీ అర్థమయ్యే రీతిలో అభినయించడం చాలా ముఖ్యమని విధుషీ స్వప్నసుందరి అన్నారు. సరికొత్త విషయాలను ఆశక్తితో శ్రద్ధగా నేర్చుకోవాలని, యువ కళాకారులందరూ నిరంతర కృషి, సాధనతో భవిష్యత్తులో లబ్ధప్రతిష్టులు కావాలని ఆమె ఆకాంక్షించారు. ముందుగా స్వాగతోపన్యాసంలో సుధామాల శిక్షణా శిబిరం వివరాలను విశదీకరించారు. నృత్యగురువులు ఇందిరాహేమ, మధుమతి, మాధవీలత, లక్ష్మిమానసలు కార్యక్రమాన్ని సమన్వయపరిచారు.

## ఏడాది పాటు దేశవ్యాప్తంగా భూదాన ఉద్యమ వజ్రోత్సవాలు




సమావేశంలో మాట్లాడుతున్న వెదిరె అరవింద్‌రెడ్డి

**సైఫాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** భూమి లేని గ్రామీణ నిరుపేదలకు సాధికారతను తీసుకు రావడం కోసం పోచంపల్లిలో భూదాన ఉద్యమం ప్రారంభించి 75 ఏళ్ళు జరిగిన సందర్భంగా వజ్రోత్స వాలను నిర్వహిస్తున్నామని అఖిల భారత సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షుడు వెదిరె అరవింద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూదాన భూదాత వెదిరె రామ చంద్రారెడ్డి కొడుకు వెదిరె ప్రోమోతిష్ చంద్రరెడ్డి, అఖిల భారత సర్వసేవ సంఘ్ తెలంగాణ రాష్ట్ర అధ్య క్షుడు తోలుపునురి కృష్ణగౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఆచార్య వినోబా భవే పోచంపల్లిలో భూదాన ఉద్యమాన్ని ప్రారంభించిన అనంతరం మొదటిగా మామ తాత సామాజిక కార్యకర్త, భూస్వామి వెదిరె రామచంద్రారెడ్డిని కలిసి భూమని దానం చేయమని అభ్యర్థించగా మొదటగా వంద ఎకరాలు, ఆ తరువాత 800 ఎకరాలు, చివరికి మరొక వంద ఎకరాల భూమిని దానం చేశారని గుర్తు చేశారు. కొందరు భూఅక్ర మార్కులు వెదిరె రామ చంద్రరెడ్డి కుటుంబ సభ్యులపేర్లు చెప్పి భూదాన భూములను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. వారిపైన న్యాయమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల ఎకరాల భూమిని వారు సేకరించడం జరిగిం దని, అప్పటి ప్రభుత్వాలు భూదాన యజ్ఞ బోర్డును ఏర్పాటు చేసి కొంత మేరకు భూదాన భూములను పంపిణి చేశారని, కాగా గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల కొంత భూమి అన్యాక్రాంత అయ్యిందని ఆరోపించారు. ఇప్పటికి మిగిలి ఉన్న కొంత భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం రక్షించి, తక్షణమే భూదాన యజ్ఞ బోర్డును ఏర్పాటు భూమిలేని నిరుపేదలకు పంచాలని, అక్రమణకు గురైన భూమిని కూడా ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలని కోరారు.

## లంబాడితండాలో డబుల్‌బెడ్ ఇళ్ల ప్రాంగణంలో పనిచేయని లిఫ్టులు

-నూతన లిఫ్టులు ఏర్పాటు చేయా : అరవింద్‌కుమార్ యాదవ్



లంబాడితండలో డబుల్‌బెడ్ ఇళ్ల ప్రాంగణంలో పనిచేయని లిఫ్టులను పరిశీలిస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్

**చిక్కడపల్లి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి లంబాడితండలో ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్ ఇళ్ళ నిర్మాణ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లిఫ్టులు నాసికంగా వేయడం మూలంగా అనునిత్యం మొరాయించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఈ డబుల్‌బెడ్‌రూమ్ నిర్మాణ సముదాయం వద్ద లిఫ్టులు ఏర్పాటు చేయడం అవికూడా నాసిరకంగా వాటిని ఏర్పాటు చేయడం వల్ల అనునిత్యం మరమ్మత్తులు చేయడానికే సమయం సరిపోతోందని, ఎన్నిసార్లు రిపేర్లు చేసినా ఫలితం లేకుండా పోతోందని విమర్శించారు. ఇప్పటివరకు లిఫ్టుల మరమ్మత్తుల కోసం లక్షల రూపాయలు ఖర్చు అయ్యాయని, వీటిని భవన సముదాయంలో ఉంటున్న వారే భరిస్తున్నారని, ప్రస్తుతం ఇకముందు భరించే స్తోమత లేని పరిస్థితి ఉందన్నారు. దాదాపు తొమ్మిది అంతస్తులతో నిర్మితమైన ఈ భవనంలో దాదాపు వెయ్యి మంది వరకు నివసిస్తున్నారని, చిన్న పిల్లలు, వృద్దులు, వికలాంగులు ఉన్నారని, లిఫ్టులు పనిచేయకపోవడం వల్ల అన్నివర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారన్నారు. లిఫ్టులు పనిచేయకపోవడం వల్ల పై అంతస్తులకు నడిచివెళ్లలేక బంధువుల ఇళ్ళకు వెళ్లాల్సిన దయనీయస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే కొత్త లిఫ్టులను వెంటనే ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ రామానుజాలరెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత నవీన్ నాయక్ అంజి యాదవ్,హరి ,సంతోష్,రవి ,సురేష్,సంజు,చందు,రాము,రవి,రాజేష్ పాల్గొన్నారు.

## కూలిన ప్రహరీ గోడ.. వ్యక్తి మృతి..

**పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

ప్రహరీ గోడ కూలడంతో అక్కడే పని చేస్తున్న ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పేట్ బషీరా బాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దూల పల్లిలోని మహాలక్ష్మి లేఅవుట్ రోడ్డులో గల కాజీఎస్సీన్స్ బిల్డింగ్ పనులు చేపడుతుండగా అక్కడ ప్రమాదవశాత్తు ప్రక్క బిల్డింగ్ కాంపౌం డ్ వాల్ కూలడంతో అక్కడే పని చేస్తున్న బొల్లి చెన్నయ్య (55) మృతి చెందాడు. మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సోషల్ మీడియాకు బానిస కావొద్దు

-కూతురును మందలించిన తల్లిదండ్రులు

-మనస్థాపానికి గురై ఇంటి నుంచి వెళ్ళిపోయిన బాలిక

**హైదరాబాద్,ఏప్రిల్ 18,ప్రభాతవార్త:** ఎప్పుడు చూసినా సోషల్ మీడియాలో మునిగి తేలుతున్నావని తల్లిదండ్రులు మందలించడంతో ఓ బాలిక ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఈఘ టన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని సయ్యద్‌నగర్‌లో నివాసం ఉంటున్న బాలిక(16) ఏడోతరగతిలో చదువు ఆపేసి ఇం ట్లోనే ఉంటోంది. గత కొన్నేండ్లుగా ఇన్‌స్టా గ్రామ్, స్నాప్ చాట్, వాట్సాప్ తదితర సోషల్ మీడియాలో అకౌంట్స్ పెట్టుకున్న బాలిక ఎప్పుడు చూసినా చాటింగ్ చేస్తుండడంతో పా టు వీడియోలు చూస్తోంది.ఈ విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు పలుమార్లు నిలదీసినా అలవాటు మానుకోలేదు. ఈ క్రమంలో రెండ్రోజుల క్రితం మరోసారి కుటుంబసభ్యులు సోషల్ మీడియాకు బానిస కావొద్దని సూచిం చారు. దీంతో మనస్థాపానికి గురైన బాలిక ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఈ మేరకు బాలిక కుటుంబసభ్యులు బంజా రాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## కులం పేరుతో దూషణ..

### కేసు నమోదు చేసిన పోలీసులు..

**పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

కులం పేరుతో దూషిస్తూ విచక్షణ రహితంగా దాడి చేసిన ఆరుగురిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదైన సంఘటన పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండ్ల పోచంపల్లి ప్రాంతానికి చెందిన జి కిరణ్ యాదవ్ తన భార్య వినితలకు కుటుంబ కలహాలతో గత కొన్ని రోజుల నుండి విడాకుల విషయంపై సికింద్రాబాద్ ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం దాఖలు చేసుకున్నారు. అయితే ఈ విషయంలో రాజీ కుదురించేందుకు బాధితురాలు వినిత తన స్నేహితురాలైన అనీషాకు తెలిపింది. దీంతో అనీషా సోదరుడు అఫ్జల్‌గంజ్ ఉస్మాన్ సాహి ప్రాంతానికి చెందిన జె.తరుణ్ కుమార్ (26)కి విషయాన్ని తెలపడంతో ఇద్దరి మధ్య రాజి కుదిరించేందుకు గుండ్ల పోచంపల్లిలోని కిరణ్ యాదవ్ ఇంటికి మార్చి 26న రాత్రి వెళ్ళాడు. అదే సమయంలో కిరణ్ యాదవ్‌తో పాటు తన అనుచరుడు కలిసి మూకుమ్మడిగా తరుణ్ కుమార్‌పై కట్టెలతో అర్ధ నగ్నంగా చేసి విచక్షణ రహితంగా దాడి చేస్తూ నోటి పదజాలతో కులం పేరుతో దూషిస్తూ సెల్ ఫోన్ లో వీడియో తీసుకుంటూ కొట్టారు. బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం ఆలస్యంగా ఈనెల 13న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిరణ్ యాదవ్‌తో పాటు మరో ఐదుగురు తన అనుచరులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అక్రమ నిర్మాణాలు ఎమ్మెల్యే అనుచరులవే!

-విమర్శించే ముందు ఆత్మ విమర్శ చేసుకోవాలి

-ఎమ్మెల్యేకు కాంగ్రెస్ యువనేత యుగంధర్ రెడ్డి సూటి ప్రశ్న



బాలనగర్ లో వెలసిన అక్రమ నిర్మాణం

**కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమం వచ్చిందంటే కాంగ్రెస్ నాయకులు ఎగేసుకుని వెళ్లి ఇండ్లు కట్టే వాళ్లపై ఫిర్యాదులు చేసి లక్షల రూపాయలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, లేదంటే కూల్చివేయిస్తున్నారని, ఇదంతా అధికారుల ప్రోద్బలంతో నడుస్తోందన్న కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన ఆరోపణలు అవాస్తవమని, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించేది స్వయంగా కూకట్పల్లి ఎమ్మెల్యేనేనని, దొంగే దొంగా... దొంగా... !అని అరిచినట్లు ఉందని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. అనుచరుల అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేయడానికి వెళితే ఎమ్మెల్యే బతిమిలాడి వెనక్కు వచ్చేయమని ప్రాధేయపడటం సిగ్గుచేటు అన్నారు. బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే అనుచరులైన సతీష్ అరోరా, డేవిడ్, ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డిలు అక్రమ నిర్మాణాలను కడుతున్నారని, వాళ్లపై ఫిర్యాదులు వెళ్లేసరికి, పుండు మీద కారం చల్లినట్లు కాగానే అక్రమంగా నిర్మించిన భవనాలను అధికారులు సీజ్ చేస్తున్నారని, లేదంటే అడిగినంత లక్షల్లో డబ్బులు ఇవ్వాలని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారని, అధికారులు కూడా కుమ్మక్కయ్యారని లేనిపోని మాటలు ఎమ్మెల్యేకు చెప్పి ఎక్కించి, ఎమ్మెల్యేను ఉసిగొలిపారని తీవ్రంగా విమర్శించారు. గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్నవాళ్లు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించింది ఎవరో ప్రజలకు తెలుసు అన్నారు.

## బార్ అసోసియేషన్ జూనియర్ న్యాయవాదులను ప్రోత్సహించాలి

-హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్




నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ వార్షిక దినోత్సవ సభలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్

**హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త**

జూనియర్ న్యాయవాదులకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమినార్లను నిర్వహించి న్యాయవాద వృత్తిలో వారు తగిన నైపుణ్యం పొందేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నాగేష్ అన్నారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు ప్రాంగణంలో మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ వార్షిక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జస్టిస్ బీమపాక నాగేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు వృత్తిలోని మేలుకువలు నేర్చుకోవడానికి సీనియర్ న్యాయవాదుల సలహాలు తీసుకోవాలన్నారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజవర్ధన్ రెడ్డి ఇటీవల నూతనంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన రవిశంకర్ అతని కార్యవర్గానికి సభకు పరిచయం చేస్తూ సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు గంధం గురుమూర్తి, దిలీప్ కుమార్ జైస్వాల్, సురేందర్ రావు ఉమామహేశ్వరరావు, నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా సిబిఐ, ఎసిబి కోర్టుల న్యాయమూర్తి టి రఘురాం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ ఎం.రామ చందర్‌రావు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు జితేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, డి.వెంకటేష్,పి.వెంకటేశ్వర్, అబ్దుల్ ఖదీర్, కొండూరు వినోద్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఆలేటి యాదగిరి, సురేఖ దీప్ సింగ్, భానుచంద్రిక తదితరులు పాల్గొన్నారు.

## అంజన్ కుమార్ యాదవ్,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌పై బిజెపి నాయకులు ఫిర్యాదు



ఛత్రినాక సిఐ వర ప్రసాద్‌కు బిజెపి నాయకులు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**చార్మినార్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ,కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఛత్రినాక పోలీస్ స్టేషన్ సిఐ వర ప్రసాద్ వర్మకు శుక్రవారం ఫిర్యాదు చేశామని భారతీయ జనతా యువమోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లి శివ చంద్రగిరి తెలిపారు.భారత ప్రధాన మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయటం దుర్మార్గమని,వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఛత్రినాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని శివ చంద్రగిరి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెవైఎం నాయకులు,ఉపాధ్యక్షులు అర్జున్,కార్యాలయ కార్యదర్శి సచిన్,సాయి కుమార్,సాకేత్,ఆకాష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పులిపాటి ఉమాదేవి మృతి పట్ల పలువురు సంతాపం

**చార్మినార్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ (రాహుల్) మాతృమూర్తి పులిపాటి ఉమాదేవి (60)గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ గురువారం మృతి చెందారు.పులిపాటి ఉమాదేవికి భర్త,ఇద్దరు కుమారులు,ఒక కుమార్తె కలరు. ఉమాదేవి మరణ వార్త తెలియగానే తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్యలాల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.పలువురు ఆమె మృత దేహంపై పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.శుక్రవారం పాతబస్తీ పురానాపూల్ శ్మశానవాటికలో ఉమాదేవి అంత్యక్రియలు జరిగాయి.

## వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు నిరసనలు




చార్మినార్ సమీపంలో ముస్లింలు వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

**చార్మినార్,ఏప్రిల్ 18 ప్రభాతవార్త :** పాతబస్తీలో శుక్రవారం మధ్యాహ్నం కొంత మంది ముస్లిం యువకులు వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.కాగా గత శుక్రవారం కూడ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు ప్ల కార్డులు పట్టుకుని నిరసన వ్యకంచేసిన విషయం విధితమే.మక్కామసీదులో శుక్రవారం మధ్యాహ్నం ప్రార్ధనలు జరిగిన అనంతరం మక్కామసీదు నుంచి మొగల్‌పుర వెళ్లె రహదారిలో కొంత మంది ముస్లింలు వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. పాతబస్తీలోని డబీర్‌పుర దర్వాజతో పాటు దారుషిఫా మైదానం వద్ద ముస్లింలు ప్ల కార్డులు పట్టుకుని వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును ఉపసంహరించు కోవాలని నినాదాలు చేశారు.చార్మినార్,మీర్‌చౌక్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు ముందు ఉంటా

**అఫ్జల్‌గంజ్,ఏప్రిల్ 18ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకుగాను ఎల్లప్పుడు ముందు ఉంటాననిగోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు మునకుంట్ల ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయనజాంబాగ్ డివిజన్ పరిధిలోని కట్టెలమండి,బిజెపి రాష్ట్ర కార్యాలయం లైన్,మజీద్ గల్లీ,కోజాస్ కాలని తదితర బస్తీలలో పొంగిపోర్లుతున్న డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం జలమండలి అధికారులను సమాచారం అందించిఎయిర్ టెక్స్ మిషన్ అక్కడికి రప్పించి పొంగిపోర్లుతున్న డ్రైనేజీ పనులను చేయించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా మురుగునీరు ఏరులై పారుతుందన్నారు. మురుగు నీటి ద్వారా వ్యాపిస్తున్న దుర్వాసన పీల్చలేక ఇబ్బందుల పాలవుతున్నట్లు చెప్పారు.ఆన్‌లైన్‌లో ఎన్ని ఫిర్యాదు చేసిన పట్టించుకోవకపోవడంతో స్థానిక ప్రజలు తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే జలమండలి అధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలను చేపట్టినట్లు చెప్పారు.ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ తాను ప్రజా జీవితంలో 30 ఏళ్ల నుండి ప్రజల మధ్యలో ఉంటున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దళితరత్న అవార్డుగ్రహీతలను సత్కరించిన స్పీకర్



**అత్తాపూర్ ఏప్రిల్ 18,ప్రభాతవార్త :** డా. బీ ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రాజేంద్రనగర్ సర్కిల్‌కి సంబంధించిన పలువురు సంఘ సేవలను గుర్తించి వారికి "దళిత రత్న "పురస్కారాలు అందించింది.శుక్రవారం ఈ అవార్డు లను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా దాసరి సత్యనారాయణ. ఎస్.లక్ష్మణ్ రావు. తోట హరి నర్సింహా. పంబల జనార్ధన్ . మల్లపల్లి శ్రీశైలం . పత్యర నర్సింహాలు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు. వరి లలిత్. పత్యర రాజు. డా, వేము వందనం .రజినీగౌడ్. గొడుగు సంజీవ. కొత్తపల్లి సంతోష్. మల్కారం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తితో కార్మికలోకం ప్రభుత్వ విధానాలను తిప్పికోట్టాలి

**సైఫాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మేడే స్ఫూర్తితో ప్రధాని నరే ంద్రమోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధాలను తిప్పికోట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కార్మికలోకానికి పిలుపునిచ్చారు. శుక్రవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఎఐటియుసి మేడే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. ప్రపంచ కార్మిక ఐక్య పోరాట దినోత్సమైన మేడే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కార్మిక చట్టాల కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు నిర వ్వహించేందుకు కార్మికులు సిద్దం కావాలని వారు కోరారు. ఒక వైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నప్పటికి ప్రభుత్వంలో ఏలాంటి చలనం లేదని, ధరలకు అనుగుణంగా కార్మిక వర్గం జీవించడానికి ఉపాధి పొందే పారిశ్రామిక సంస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.డి.యూసఫ్, ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహ్మా, నాయకులు వి.ఎస్.బోస్, ఏసురత్నం, ఎస్.విలాస్, తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం

**హైదరాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త**

హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే సింగూరు మూడవ దశకు విద్యుత్తు సరఫరా చేసే 132 కెవి పెద్దాపూర్ వద్ద టిజి ట్రాన్స్ కో అధికారులు మరమ్మతు, జలమండలి లీకేజీ పనులు చేపట్టారు. ఈ పనుల కారణంగా పలు రిజర్వాయర్ ప్రాంతాల్లో.. నీటి సరఫరాలో రాత్రి 11 గంటలవరకు పలు చోట్ల పూర్తిగా అంతరాయం కలుగుతుంది. పలు చోట్ల లోప్రెజర్‌తో నీటి సరఫరా జరగుతుందన్నారు. ఓ అండ్ ఎం డివిజన్ 6లో బంజారాహిల్స్, సోమాజిగూడ, జూబ్లిహిల్స్, తట్టిఖాన, ఎర్రగడ్డ, వెంగల్‌రావునగర్, ఎస్.ఆర్.నగర్, ఫతేనగర్, ఎల్లారెడ్డిగూడ, ఎస్‌పిఆర్‌హిల్స్, బోరబండ ప్రాంతాలు, ఓ అండ్ ఎం డివిజన్ 9 పరిధిలో కేపీహెచ్‌బీ కాలనీ, బాలాజీ నగర్, కూకట్‌పల్లి, బాలానగర్, మూసాపేట, భారత్ నగర్, మోతీనగర్, గాయత్రీ నగర్ ప్రాంతాలు ఉండగా, ఓ అండ్ ఎం డివిజన్ 15 పరిధిలోని కొండాపూర్, డోయెన్స్ కాలనీలు ఉన్నాయి. ఓ అండ్ ఎం డివిజన్ 17 పరిధిలో మయూరినగర్, హఫీజ్‌పేట్ ప్రాంతాలు, ఓ అండ్ ఎం డివిజన్ 3 పరిధిలోని షేక్ పేట్, భోజగుట్ట రిజర్వాయర్ ఉన్నాయి. ఓ అండ్ ఎం డివిజన్ 18 పరిధిలో మణికొండ, నార్సింగి, మంచి రేవులు ప్రాంతాలు ఉన్నాయి. అంతరాయం ఏర్పడనున్న ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో నేడు అవగాహన సదస్సు..

**నిజాంపేట్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త** ఒకే దేశం ఒకే ఎన్నిక వికసిత్ భారత్ కోసం అనే కార్యక్రమంపై నేడు ఉదయం 11 గంటలకు ప్రగతి నగర్, శ్రీకృష్ణ గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ విచ్చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఒక్కరు ఈ అవగాహన సదస్సులో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

## మాజీ ఎమ్మెల్యే సమక్షంలో సొంత గూటికి...

**కంగ్టి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీపై ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సేవలకు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు బిజెపి నాయకులు తెలిపారు. బిఆర్ఎస్‌లో చేరిన సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు సిద్దుపాటిల్, మాజీ సర్పంచ్‌లు బసప్ప, ప్రకాష్, రాజుల అనుచరులకు బిఆర్ఎస్ పార్టీ ఖండువాలు కప్పి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కారెక్కించుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి సభ్యులు ఆంజనేయులు సేట్, మాజీ ఎంపిపి అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, మజీ మండల పార్టీ అధ్యక్షులు సంతోష్ పాటిల్, విశ్వనాథ్, మాజీ సర్పంచ్ కృష్ణ ముదిరాజ్, సాయిలు, నాయకులు మాణిక్‌రెడ్డి, పవన్‌పాటిల్ సంజుపాటిల్, సాయిగౌడ్, రమేష్‌పాటిల్ దత్తు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



రూప్లతండాలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యుల సమావేశం

**సిర్గాపూర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** దరఖాస్తులు చేసుకున్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ భీంరావునాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రూప్లానాయక్ తండాలో ఎంపిడిఓ మల్సూర్‌నాయక్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా భీంరావు నాయక్ మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేసిన ప్రతి హామిని అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి భీమేష్, ఇందిరమ్మ కమిటి సభ్యులు వెంకట్, సక్రిబాయి పాల్గొన్నారు.

## చక్రియాల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



చక్రియాల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**చౌటకూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చక్రియాల్‌లో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ధాన్యాన్ని మధ్యదళారులకు అమ్ముకుని ఆగం కావొద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తరలించి ఆర్థికంగా లబ్ధిపొందాలన్నారు. సన్న బియ్యం రకానికి ప్రభుత్వం మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్‌గా అందిస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నత్తి దశరథ్, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పత్త రాములన్న, చక్రియాల్ అధ్యక్షుడు సిహెచ్ రాజశేఖర్, మాజీ సర్పంచ్ రోళ్లపాటి పండరి, మాజీ ఎంపిటిసి సభ్యులు టి.పండరి, ప్రభురెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బి లక్ష్మణ్, ఆర్.సత్యనారాయణ, అంజిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజ నర్సింహారెడ్డి, ఆనందం, లింగయ్య తదితరులు ఉన్నారు.

## జహీరాబాద్ డిపోలో మర్యాద దినోత్సవం



ఆర్టీసి క్యూఆర్ కోడ్‌కి చైన్‌ను విడుదల చేస్తున్న డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి

**జహీరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్‌లో ఎండి సజ్జనార్ ఆదేశాలమేరకు శుక్రవారం మర్యాద దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రతి మాసంలో 3వ శుక్రవారం మర్యాద దినోత్సవ జరుపుకంటూ వస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన మర్యాద దినోత్సవానికి ముఖ్యఅతిథిగా డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఎండి సజ్జానార్ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన కీ చైన్స్‌ను డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్, డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డిలు విడుదల చేశారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆర్టీసి సంబంధించిన అన్ని రకాల సేవలను పొందవచ్చని డిపో మేనేజర్ జాకీర్‌హుస్సేన్ పేర్కొన్నారు. కీచైన్‌ను పోలీసు సిబ్బందికి, డిపోసిబ్బందికి, ప్రయాణీకులకు అందచేశారు.

## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

**గుమ్మడిదల, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ప్యారానగర్, నల్లవల్లి ప్రాంతాల్లో ప్రతిపాదిత డంప్ యార్డ్ నిర్మాణానికి వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో 73వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక ప్రజలు, రైతులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున ఈ దీక్షల్లో పాల్గొంటూ తమ నిరసనను తెలుపుతున్నారు. రిలే నిరాహార దీక్షలో గుమ్మడిదల మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, రైతు నాయకులు అమ్మగారి సదానంద రెడ్డి, మద్ది బాల్‌రెడ్డి, చిమ్ముల దేవేందర్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, పోచుగారి మోహన్ రెడ్డి, కొత్తపల్లి మల్లేష్ గౌడ్, మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, మంద భాస్కర్ రెడ్డి, జగ్గారెడ్డి, బాల్‌రెడ్డి, సూర్యనారాయణ, కాలకంటి బాల్‌రెడ్డి, ఆంజనేయులుయాదవ్, ఉదయ్ కుమార్, మద్ది మోహన్ రెడ్డి, ఆయుబ్, నర్సింలు, బక్క సత్యనారాయణ, మండల జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



డంప్‌యార్డ్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్ష దృశ్యం

# అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

### జెఎన్‌టియు విసి కిషన్‌కుమార్‌రెడ్డి

**చౌటకూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాల్సిన అవసరం విద్యార్థులపై ఉంటుందని జేఎన్టీయూ వైస్ ఛాన్స్‌లర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మూడురోజులుగా నిర్వహించిన టెక్నికల్ సైన్స్ 2కే25 ఉత్సవాలు గురువారంతో ఘనంగా ముగిసాయి. ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి వైస్ ఛాన్స్‌లర్ ముఖ్య అతిథిగా హాజరై కళాశాలలో ఏర్పాటు చేసిన సైకిల్ స్టాండ్‌ను ప్రారంభించి 100 సైకిళ్లను రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుతో కలిసి విద్యార్థులకు అందచేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్స్‌లర్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అందుకున్న విద్యార్థులకు ఉన్నత స్థానాల్లో నిలుస్తారన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ ప్రత్యేక దృష్టితో కళాశాల అభ్యున్నతికి కృషి సల్పుతుండటం అభినందనీయమని కొనియాడారు. కళాశాలను గ్రీన్ క్యాంపస్‌గా మార్చాలన్న ఉద్దేశంతో మంత్రి దామోదర్ విద్యార్థులకు 100 సైకిళ్ల మంజూరు చేయించారని గుర్తు చేశారు. అందోలు వద్ద ఫార్మసీ కళాశాల నిర్మాణానికి 15 ఎకరాల భూమిని కేటాయించారన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న ప్రిన్సిపాల్ నరసింహ

**ఆటపాటలతో జోష్‌లో విద్యార్థులు...**

మూడు రోజులుగా కళాశాలలో కొనసాగుతున్న ఉత్సావాల ముగింపును పురస్కరించుకుని కళాశాలలో జోష్ నెలకొంది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వైస్ ఛాన్స్‌లర్ కిషన్ కుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై విద్యార్థులు డాన్సులు, ఆటలు, పాటలతో అదరగొట్టారు. సినీమా పాటలకు అనుగుణంగా విద్యార్థిని విద్యార్థులు స్టెప్పులు వేస్తూ సభికులను హోరెత్తించారు.

కళాశాలలో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అంద చేశారు. వివిధ విభాగాల క్రీడాపోటీలు, టెక్నికల్, నాన్ టెక్నికల్ ప్రాజెక్టులు తయారుచేసి ప్రదర్శించిన ఆయా విభాగాలకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, అధ్యాపకులు రజనేష్, జోషి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సునీతారెడ్డి, ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రథాన్ని సిద్దేశ్వర ఆలయానికి ఊరేగింపుగా శోభాయత్ర నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా సిద్దేశ్వర జాతర ఉత్సవాలు

### -ఆకట్టుకున్న రథం ఉరేగింపు..భక్తిని చాటిన అగ్ని తొక్కడం

**కంగ్టి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మూడు రోజులుగా శ్రీ సిద్దేశ్వర స్వామి జాతర ఉత్సవాలు భక్తి శ్రద్దలతో కొనసాగుతున్నాయి. జాతర ఉత్సవాలకు గ్రామస్థులతో పాటు నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా ఉదయం అగ్ని తొక్కడం కార్యక్రమం కొనసాగింది. భక్తులు స్వామివారిని స్మరిస్తూ అగ్నిగుండం దాటారు. ప్రత్యేకంగా అలంకరించిన రథాన్ని భజనలు చేస్తూ, స్వామివారిని స్మరిస్తూ గ్రామంలోని పురవీధుల గుండా ఆలయం వరకు ఊరేగించారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్ర శేఖర్‌రెడ్డి, ఆలయ కమిటి చైర్మన్ దారం వెంకన్న, ఆలయ ఎండోమెంట్ అధికారి రుద్రప్ప, భక్తులు పాల్గొన్నారు.

## నేడు దళిత హక్కులు సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డిబిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాసి సంజీవ్

**నిజాంపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోగల వంజర సంఘం కమ్యూనిటీ హాల్లో నేడు శనివారం నాడు జరగబోయే ఏప్రిల్ మాసం మహనీయులు జయంతి ఉత్సవాల్లో భాగంగా దళిత హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సును డిబిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నందున, ఈ సదస్సుకు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ డిడి శశికళ, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ హాజరవుతున్నారు కావున మండలంలో ఆయా గ్రామాలలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత సదస్సుకు సకాలంలో హాజరై సంక్షేమ పథకాలు హక్కులపై అవగాహన, అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ టిఎస్ అధ్యక్షులు గరుగుల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ కొమ్మాట బాబు, మేకల రమేష్, బ్యాగరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**కొల్చారం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిన్న ఘణపూర్ గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి శుక్రవారం పిఎసిఎస్ చైర్మన్ నాగయ్యతో కలిసి ప్రారంభించారు. ముందుగా తూకానికి కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి, ధాన్యాన్ని తూకం వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి, దళారుల చేతిలో రైతులు మోసపోవద్దని అన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడకుండా ఏర్పాటు చేయాలని పిఎసిఎస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సూరెగారి నరేందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పాశం శ్రీనివాస్ రెడ్డి, బాగారెడ్డి, రాజా గౌడ్, రవితేజ రెడ్డి, ముత్యంగారి సంతోష్ కుమార్, సందీప్, లక్ష్మీనారాయణ గౌడ్, మురళి గౌడ్, మంగలి శంకర్, సీఈఓ కృష్ణ, రైతులు, పిఎసిఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి



అల్లాదుర్గంలో ఎడ్ల బండ్ల ఊరేగింపు దృశ్యం

## వైభవంగా బేతాళ స్వామి జాతర ఉత్సవాలు

### -ఆకట్టుకున్న బండ్ల ఊరేగింపు

**అల్లాదుర్గం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శ్రీబేతాళ స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బేతాళస్వామికి రంగురంగు కాగితాలతో అలంకరించిన ఎడ్ల బండ్లను గోవింద నామస్మరణతో సన్నాయి సప్పుళ్లతో, బ్యాండ్ మేళాల మధ్య ఆలయం చుట్టూ 5 మార్లు ప్రదక్షిణలు చేయించారు. అల్లాదుర్గంకు చెందిన ఆకుల వెంకయ్య, బహిరన్‌దిబ్బకు చెందిన లేకి దుర్గయ్య బండ్లు ముందు వరుసలో ఉండి అందరిని ఆకట్టుకున్నాయి. జాతర ఉత్సవాలకు మండల ప్రజలతో పాటు తెలంగాణలోని ఆయా జిల్లాలు, కర్ణాకట, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని భూతపిశాచాలకు అధిపతి బేతాళ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాతర ఉత్సవాలు ప్రశాంతంగా సాగేలా సిఐ రుణుకా సిబ్బందితో ఎడ్లబండ్ల ముందు బందోస్తును నిర్వహించారు.

## సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

**కొల్చారం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** సిఎం రిలీఫ్ ఫండ్‌ను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ యూత్ ఐకాన్ నాయకులు యాబన్నగారి రవితేజరెడ్డి అన్నారు. శుక్రవారం కొల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన వార్డ్ మాజీ సభ్యులు జుంజు రత్నయ్యకు సీఎంఆర్ఎఫ్ చెక్కును రవితేజరెడ్డి పార్టీ నాయకులతో కలిసి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మురళి గౌడ్, సంతోష ఎల్లేశం, మాజీ ఎంపిటిసి ఆదం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆంజనేయులు, సుధాకర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

### నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**కొల్చారం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అప్పాజిపల్లి గ్రామానికి చెందిన చింతల శేకులు, విజయ దంపతుల కుమార్తె నవీన, భాస్కర్ వివాహం కొల్చారం మండల పరిధిలోని సంగాయిపేట గ్రామ శివారులోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించగా, ఈ వివాహ వేడుకల నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరై వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సూరెగారి నరేందర్ రెడ్డి, అరిగె రమేష్ కుమార్, సంతోష్ కుమార్, రవితేజ రెడ్డి, మురళి గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

### అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే

## చర్యలు తీసుకుంటాం : డిఎస్‌పి ప్రసన్నకుమార్

**కొల్చారం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. శుక్రవారం కొల్చారంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో సంఘటన స్థలాన్ని ఆయన సందర్శించారు. ఈ నెల 13వ తేదీన రాత్రికి రాత్రే అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉద్రిక్త పరిస్థితుల మధ్య 14వ తేదీన అంబేద్కర్ జయంతి రోజు ఆవిష్కరించడంతో, అంబేద్కర్ విగ్రహం ముందు కొద్ది దూరంలో అదే స్థలంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని గ్రామానికి చెందిన యువజన సంఘాల సభ్యులు, యువకులు, ప్రజలు భూమి పూజ చేశారు. శుక్రవారం ఛత్రపతి శివాజీమహారాజ్ విగ్రహ నిర్మాణానికి సన్నాహాలు చేయడంతో ఇరువర్గాల వారు ఘర్షణకు దిగారు. దీంతో ఎస్ఐ మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో పోలీసులు రెండు వర్గాలవారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ప్రత్యేక పోలీసు బాలగాలను రప్పించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకొని వివాదాస్పద అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం కొల్చారం పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఎవరైనా విగ్రహాలు ఏర్పాటు చేయాలంటే తప్పకుండా అనుమతి తీసుకోవాలని అన్నారు. రోడ్డు మధ్యలో ఇరుకు స్థలంలో విగ్రహాలు ఏర్పాటు చేయడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ప్రయత్నించడం సమంజసం కాదని ఆయన అన్నారు. త్వరలో గ్రామ పెద్దలు, ఇరు వర్గాల వారితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడతామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ రూరల్ సీ రాజశేఖర్ రెడ్డి, కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

## హేమ కుకింగ్ గ్యాస్ కంపెనీలో అవగాహన

**సదాశివపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** అగ్ని మాపక వారోత్సవాలను పురష్కరించుకుని శుక్రవారం పట్టణంలోని హేమ కుకింగ్ గ్యాస్ కంపెనీలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి బిక్షపతి, ఎల్ఎఫ్ అబ్దుల్ మున్అఫ్, డ్రైవర్ ఆపరేటర్ మహమ్మద్ తయ్యబ్, ఫైర్ మ్యాన్ మహమ్మద్ అష్ట, చైతన్య కుమార్, రవీందర్, సాయికుమార్, గ్యాస్‌గోడౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

### నేటి నుంచి పంచలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

### -19న సంగీత్ దర్బార్-20న కళ్యాణోత్సవం

**మనూర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బాదల్‌గావ్‌లో కొలువున్న శ్రీపంచలింగేశ్వర స్వామి షష్టమి వార్షికత్సోవాలకు ఆలయం ముస్తాబాయింది. ఈ నెల 19న సాయంత్రం 6.15 గంటలకు సంగీత్ దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ బాధ్యులు పేర్కొన్నారు. 20న ఉదయం 4.45 గంటలకు సుప్రభాత సేవ, ఆవాహిక మండపారాధన, రుద్రాభిషేకం, అభిషేకం, గణపతిపూజ నవగ్రహ సహిత రుద్రహోమం, ఉదయం 10.45 గంటలకు శివ పార్వతుల కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు సకల మత స్థాపకులు శ్రీ కాశీనాథ్ బాబా ఆధ్వర్యంలో వైభంగా నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు నాట్యనంద కళాబృందం శ్రీ భరత్ బృందంచే భరత్ నాట్యం కార్యక్రమం ఉంటుందన్నారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కరుణాకటాక్షాలను అందుకోవాలని నిర్వాహకులు సూచించారు.

## దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం

**రామచంద్రాపురం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ముంబై కాలనీకి చెందిన నిరుపేద వ్యక్తి సురకంటి బాలరాజు మృతి చెందడంతో దహన సంస్కారాల నిమిత్తం ఏకే ఫౌండేషన్ భాధ్యులు షేక్ అబ్దుల్ ఖదీర్ తన వంతుగా బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసహాయం అందచేశారు. కులమతాలకు,రాజకీయ పార్టీలకు అతీతంగా పేదలకు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు.

## అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం

**పాపన్నపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కుర్తివాడ గ్రామానికి చెందిన ముగ్గురు అనాథ పిల్లలకు దుబ్బాక శ్రీసద్గురు స్వామి సమర్థ మహారాజ్ తరఫున శుక్రవారం రూ. 11 వేల ఆర్థిక సహాయం అందచేసినట్లు కొత్త విషాంత్‌గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా కొత్త విషాంత్ గుప్తా మాట్లాడుతూ స్వామి సమర్థ మహారాజ్ ఆర్థిక సహాయం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్తూరి స్రవంతి శ్రీనివాస్, మధు, పిల్లల మేనమామ కమలాకార్ చంద్రమోహన్ ఉన్నారు.

## తాగునీటి పైపులైను పనులు ప్రారంభం



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్

**అమీన్‌పూర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మంచినీటి సరఫరాలో శాశ్వత పరిష్కారానికి చేపట్టిన పైప్ లైన్ పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని అధికారులను మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి కోరారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బంధంకొమ్ము శ్రీధం హిల్స్‌కాలనీలో 160/110 ఎంఎం హెచ్‌డిపి మంచి నీటి సరఫరా పైప్ లైన్ పనులను శుక్రవారం మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవిలో ఉన్నా, లేకున్నా ప్రజలకు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు డి.జీ.ఎం చంద్రశేఖర్, ఏ.ఈ. పూర్ణేశ్వరీ, మాజీ కౌన్సిలర్ బిజిలి రాజు, కొల్లూరు గోపాల్, మాజీ కో ఆప్షన్ మెంబెర్ చౌటకురి మహిపాల్ రెడ్డి, దాసు యాదవ్, సురేందర్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పేదవాని వివాహానికి ఆర్థిక సహాయం అందజేత

**కొల్చారం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన పేద కుటుంబం ఒడ్డె ఊసెన్ పెళ్లి నిమితం మాజీ సర్పంచి తిరుణగారి గోదావరి రూ. 5 వేలు, 30 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు నాగులగారి సుధాకర్, ఉపాధ్యక్షులు నాగరాజు, నారాయణ, నరేందర్ సోమేష్, పుష్పారాగి, నిర్మల పాల్గొన్నారు.

**అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో...**

కిష్టాపూర్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు వరిగుంతం నాగరాజు, సాదుల సుధాకర్‌లు బట్టలు, ఇతర సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దుల వెంకటేశం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## రాజ్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ మండలం రాజ్ పల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రోహిత్‌రావు కొనుగోలు కేంద్రాల వసతులపై ఆరా తీశారు. వరి కాకుండా ఇతర పంటలు సాగు చేస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కాంటాలు, తేమ యంత్రాలు, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు ఉన్నాయా, లేవా అని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆరా తీశారు. అనంతరం శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించి, రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

## ఛలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ

**కొల్చారం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీ 25వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో లక్షలాది మందితో నిర్వహించే రజతోత్సవ సభకు ప్రజలందరూ భారీ సంఖ్యలు హాజరై విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యూత్ ఐకాన్ రవితేజరెడ్డి ఉన్నారు. శుక్రవారం కొల్చారం మండల పరిధిలోని పైతర గ్రామంలో ఛలో వరంగల్ గోడపత్రికను పైతర బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవితేజ రెడ్డి మాట్లాడుతూ మన ఇంటి పార్టీ, మనకు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పది సంవత్సరాల పాలనలో దేశంలో మన రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలబెట్టిన బీఆర్ఎస్ పార్టీని మనం కాపాడుకోవాలని, కేసీఆర్ నాయకత్వం మనకు శ్రీరామరక్ష అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మురళిగౌడ్, సంతోష ఎల్లేశం, మాజీ ఎంపిటిసి ఆదం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆంజనేయులు, సుధాకర్ ఉన్నారు.



ఛలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# నిరంతరం అందుబాటులో ఉంటూ ఉచిత వైద్య సేవలు

### బిబిఎల్ హాస్పిటల్ చైర్మన్ లక్ష్మీనారాయణ

**గుమ్మడిదల, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారంలో తల్లిదండ్రులు చూపిన సేవా మార్గాన్ని మరిచిపోకుండా నిరు పేదలకు ఏదో రకంగా సేవ చేయాలని వైద్య వృత్తిని ఎంచుకొని నిరుపేదలకు ఉచిత వైద్యం అందించాలనే సంకల్పంతో అన్నారం పరిధిలో బిబిఎల్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసుకొని గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలకి ఉచితంగా వైద్యం అందిస్తూ సేవ గుణాన్ని చాటుతున్నారు. బిబిఎల్ హాస్పిటల్ చైర్మన్ లక్ష్మీనారాయణ, (ఎండి) ఆయేషా, భార్య శ్యామల (బిఏఎంఎస్) దంపతులు విద్యను అభ్యసించారు. భార్యాభర్తలు ఇద్దరు సేవా గుణములో ఒకరికంటే ఒకరు ముందుంటారు. పెద్ద వారికే కాకుండా పసి పిల్లలకు తమ వైద్య సేవలు ఉచితంగా అందాలనే ముఖ్య ఉద్దేశంతో సొంత నిధులను కేటాయించి పిల్లల వైద్య నిపుణులు నారాయణను ఏర్పాటు చేసుకొని 24 గంటలు నిరంతరం అందుబాటులో ఉంటూ ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నారు. సేవే మార్గంగా సమాజానికి తన వంతు బాధ్యతగా వైద్యవృత్తి ఎంచుకొని తల్లిదండ్రులు చూపిన మార్గాన్ని ఏనాడు మర్చిపోకుండా సమాజంలో ఉన్న పేదలకు సహాయం చేయాలని ముఖ్య ఉద్దేశంతో తనకంటూ ఒక సేవ మార్గాన్ని అవలంభించుకొని వైద్యవృత్తి సేవ చేస్తున్నారు.24 గంటలు ఎవరికి ఏ ఆపద వచ్చినా, రోగి లేవలేని పరిస్థితిలో ఉన్న ఒక్కఫోను ద్వారా ఇళ్లలోకి వెళ్లి ఉచిత వైద్యం అందిస్తూ తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పాటుచేసుకొని గ్రామంలోని నాయ కులు, ప్రజల మన్నలను పొందుతున్నారు. నిరం తరం ప్రజల ఆరోగ్యం పట్ల వాళ్ల కలిగి ఉన్న సేవా గుణం, ఆసక్తి, సేవలను ఈ విధంగానే కొనసాగా లని గ్రామస్థులు, పలువురు భార్యాభర్తలను అభినందిస్తున్నారు.



మాట్లాడుతున్న బిబిఎల్‌హాస్పిటల్ చైర్మన్ లక్ష్మీనారాయణ